

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 355 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 21, నవంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# కేయూలో.. రక్షణ కొరత !

సమస్యల పర్వంతో సతమతమవుతున్న కేయూ

అమ్మాయిల హాస్టల్స్‌లో పనికట్టుకొని తిరుగుతున్న కీచకుడు ఎవరు?

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన హాస్టల్స్ వ్యవహారం

విద్యార్థుల సమస్యల పట్ల పరిష్కారాలు ఎక్కడ?

భూ కబ్జాదారులపై వీసీ, రిజిస్ట్రార్ ఉక్కుపాదం మోపేదెన్నడు?

ప్రహరీ గోడ నిర్మాణం ఉన్నట్టా... లేనట్టా...

కీచకుని వ్యవహారంతో కూలిపోతున్న విద్యా ప్రతిష్ఠ

మత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న కేయూ

అవినీతిపరులతో అవినీతి లెక్కలపై కమిటీలు వేయడం విచిత్రంగా ఉంది

మధ్యరాత్రి వరకు విద్యార్థినులు, విద్యార్థులు విచ్చలవిడిగా తిరుగుతున్నారు

డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్) :

కాకతీయ విశ్వవిద్యాలయం రక్షణ లేమితో కొనసాగుతోందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. కొంతమంది పాలన అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు ఎత్తివేయబడుతున్నాయని తెలిపారు. అధికార పదవిని అడ్డం పెట్టుకొని ఒకరిద్దరు కీచకులు సమయ పాలన లేకుండా కేయూ గర్ల్స్ హాస్టల్స్‌లో చొరబడుతూ, హాస్టల్ ఆఫీస్ కార్యాలయంలో అడ్డాలు వేస్తున్నారని ఆరోపించారు. వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, హాస్టల్స్ డైరెక్టర్, మహిళా అధికారులు మినహాయించి ఏ పాలన అధికారికైనా అనుమతి లేకుండా మహిళా హాస్టల్స్‌లోకి ప్రవేశించేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. అమ్మాయిల హాస్టల్స్‌లో పని కట్టుకొని తిరుగుతున్న కీచకులను సీసీ కెమెరాల ఆధారంగా మందలించాలని డిమాండ్ చేశారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన హాస్టల్స్ వ్యవహారంపై నిజాయితీపరులైన వీసీ, రిజిస్ట్రార్ అధికార హోదాలో అవినీతిపరులతో కమిటీలు వేయడం విపరీతమైన విమర్శలకు దారి తీసిందన్నారు. అభియోగాలు మోపబడిన వ్యక్తులు, అవినీతికి పాల్పడిన వ్యక్తులతో కమిటీలు వేయడం అధికార దుర్వినియోగమేనని నిలదీశారు. వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాలు, ప్రిన్సిపల్ కార్యాలయం కొనసాగిస్తున్న నిజాయితీని మిగతా కార్యాలయాలు ఎందుకు అనుసరించడం లేదని ప్రశ్నించారు. గత సమస్యలను గాలికొదిలేస్తూ, ప్రస్తుత సమస్యలపై పరిష్కారం చూపిస్తామంటూ అవినీతిపరులను, అక్రమార్కులను పాలన అధికార హోదాల్లో కొనసాగిస్తూ వారినే ముందుంచడం వీసీ, రిజిస్ట్రార్లకు తగునా అని సూటిగా ప్రశ్నించారు. భూ కబ్జాదారుల పక్షాన వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కబ్జాదారులకు అండగా నిలుస్తున్న కీచకుని భరతం పట్టాలని ల్యాండ్స్ కమిటీ



## అణగారిన వర్గాల్లో అరుదైన అధికారి

అంచలంచలుగా ఎదిగిన శ్రమజీవి ఆచార్య రామచంద్రం

నిజాయితీకి మారుపేరుగా నిలుస్తున్నారు

అధికార హోదాలో ఎక్కడ అవినీతికి అవకాశం లేదు

రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం సేవలు కొనియాడదగినవి

2



## వండర్ ఫుల్‌గా.. నిర్వహించబడిన వార్షికోత్సవం

బిలివర్స్ చర్చ్ క్రైస్తవ గొప్పతనాన్ని చాటుతుంది

బిలీవర్స్ చర్చ్ 25వ వార్షికోత్సవ జూబ్లీ శుభసందర్భంగా

నందనం గ్రామంలో మహెూత్సవ వేడుకలు

3




## రాజనీతి శాస్త్రంలో జై భీమ్ చైర్మన్‌కు ఘన సన్మానం

2

విభాగ సిబ్బంది ఆదరాభిమానాలను మరువలేనిది

విభాగ హెడ్ డాక్టర్ సంకినేని వెంకట్ జై భీమ్ సంస్థ సుపరిచితులు

జై భీమ్ సంస్థ సమాజ ఆశయాల కోసం పనిచేస్తుంది




## వికలాంగుల హక్కులను కాపాడుకోవాలి

వికలాంగుల హక్కుల రక్షణ కోసం పాటుపడాలి

వికలాంగుల సంక్షేమం కోసం సుదీర్ఘమైన పోరాటాలు సాగుతున్నాయి

హక్కుల రక్షణలో భాగంగా ఎంతో నష్టపోతున్న దివ్యాంగులు

జై భీమ్ సంస్థ పోరాటం కొనియాడదగినది

కలిసికట్టుగా పోరాడితేనే విజయం సాధించగలం

ప్రణాళికల లక్ష్యంగా పోరాడితేనే విజయం దక్కుతుంది

3



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు

### మూడు దఫాలుగా నిర్వహణకు డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ సూచన



**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ శ్రీమతి రాణి కుముదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డితోపాటు జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ%ొ% గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. ఒక ప్రాంతంలో ఎన్నికలు పూర్తయిన తర్వాత మరొక ప్రాంతంలో ఎన్నికల మధ్య రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వల్ల సిబ్బంది, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు మరింత సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటించడంతో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉంటుందనే నేపథ్యంలో రెండు రోజుల విరామం అవసరమని డీజీపీ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరమని సూచించారు. డీజీపీ సూచనలు, భద్రతా అంశాల చర్చ అనంతరం స్టేట్ ఎలక్షన్ కమిషనర్ జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితంగా పరిశీలించి చర్యలు తీసుకోవడానికి రాష్ట్రస్థాయి రివ్యూ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

# రాజనీతి శాస్త్రంలో జై భీమ్ ఛైర్మన్‌కు ఘన సన్మానం

### విభాగ సిబ్బంది ఆదరాభిమానాలను మరువలేనిది
### విభాగ హెడ్ డాక్టర్ సంకినేని వెంకట్ జై భీమ్ సంస్థ సుపరిచితులు
### జై భీమ్ సంస్థ సమాజ ఆశయాల కోసం పనిచేస్తుంది




**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో విభాగ అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ సమక్షంలో గురువారం విభాగ అధ్యాపకులు అంతా కలిసి జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివను సన్మానించారు. తదనంతరం ఇప్పుడు బరిగెల శివ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ కు జై భీమ్ సంస్థల చిత్రపటం అందించి శాలువాతో చిరు సత్కారం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం మాట్లాడుకుంటూ డాక్టర్ సంకినేని వెంకట్ జై భీమ్ సంస్థకు సుపరిచితులని తెలుపుతూ విద్యా హక్కుల కోసం విశ్వవిద్యాలయ రక్షణ కోసం ప్రతి అధ్యాపకుడు పాటుపడాలని డాక్టర్ బరిగెల శివ సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం

### గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఘనంగా సన్మానం

**అమరావతి,నవంబర్ 20(జై భీమ్ న్యూస్):**

నటుడు నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం వైభవంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'వేడుకలో బాలయ్యను సన్మానించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ బాలకృష్ణను శాలువాతో సత్కరించారు. 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రజనీకాంత్‌ను కూడా ముగింపు వేడుకలో సన్మానించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ వేడుక కొనసాగనుంది.

# కేయూలో రక్షణ కొరత

మొదటి పేజీ తరువాయి




సభ్యులను కోరారు. భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపడంలో వీసీ, రిజిస్ట్రార్లు పూర్తిగా విఫలమవుతున్నారని నిలదీశారు. పైగా కేయూ లెటర్ 362/కేయూ/2021 ఆధారంగా కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు కాకతీయ విశ్వవిద్యాలయ భూములకు డిజిటల్, ఫిజికల్ సర్వే నిర్వహించిన కలెక్టర్ సర్వే నివేదికలు (లెటర్ నెంబర్ ఏ1/232/2022, ఏ5/669/2022) స్వహస్తాలతో సంతకాలు చేసి తీసుకున్న గత వీసీ, రిజిస్ట్రార్లు ఆ నివేదికలను మాయం చేసిన వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భూ కబ్జాదారులపై, కబ్జాలకు పాల్పడిన వ్యక్తుల పేర్లను ఉచ్చరిస్తూ గతంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నతాధికారులకు కఠిన చర్యల కోసం కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డెవలప్‌మెంట్ కార్యాలయాలు అనేక లేఖలు రాసినా నేటికీ సాధారణ చర్యలు కూడా జరగకపోవడం కీచకుని చొరవేనని తీవ్రంగా విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వ విద్యాశాఖ ఉన్నతాధికారులతోపాటు పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు భూ కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి లేఖలు రాసి కేయూ అధికారులు తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. ల్యాండ్స్ కమిటీ పుణ్యమా అని ఆమాత్రం భూ కబ్జాలు నియంత్రించబడుతున్నాయని, ప్రహరీ గోడ శంకుస్థాపన జరిగి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్యాచరణలో ఆలస్యం ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం చుట్టూ పకడ్బందీ ప్రహరీ గోడ లేకపోవడం వల్లనే అసామాజిక శక్తుల చొరబాటు ఎక్కువైపోతోందని, దానివల్ల కేయూకు రక్షణ, భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాండ్స్ కమిటీ పోరాట పటిమకు ప్రహరీ గోడ నిర్మాణాన్ని అప్పగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కేయూలో ఎక్కువ శాతం ఉద్యోగులు విధులకు హాజరైనట్టు సంతకాలు చేసుకొని యథేచ్ఛగా బయట తిరుగుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం పరిశోధన అంశాలను, ప్రాజెక్టులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పాలన అధికారులు అకాడమిక్ క్యాలెండర్ ఆధారంగా జరుగుతున్న అకాడమిక్స్, విద్యాబోధనలపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. మధ్యరాత్రి వరకు విద్యార్థినులు, విద్యార్థులు విచ్చలవిడిగా తిరగడాన్ని పూర్తిగా తప్పుపట్టారు. హాస్టల్స్ పాలన గాడి తప్పిందని, అధికారులు అసామాజిక శక్తుల ప్రోత్సాహంతో అవినీతికి పాల్పడుతూ విద్యార్థుల రక్షణను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేయూలో జీఎస్టీ బిల్లులు ఆమోదం పొందకపోవడం విచిత్రంగా ఉందని, సాధారణ బిల్లులు దొంగ బిల్లులుగా మారి ఆడిట్‌కు నోచుకోకుండా అనుమతించబడుతున్నాయని తప్పుపట్టారు. బయటి వ్యక్తుల సంచారం స్వేచ్ఛగా మారిపోతుండగా, డ్రగ్స్ వాడే వ్యక్తులు దొడ్డిదారి మార్గాల ద్వారా కేయూలోకి చొరబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న కేయూను కీచకుని చేతిలో నుంచి కాపాడాలని వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్‌లను కోరారు. మైళ్ల దూరం నడుచుకుంటూ తరగతులకు వెళ్తున్న కేయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల బాధలను తక్షణమే అర్థం చేసుకొని వారికి బస్సు సౌకర్యం కల్పించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థినుల రాకపోకల్లో కీచకుల గోల ఎక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఇంకా రాకపోవడంతో పరిపాలన పూర్తిగా కుంటిపడే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు వేస్తున్న పలు పరిపాలన కమిటీల్లో కీచకులు ఉన్నారని, జాగ్రత్త అని అన్ని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయని తెలిపారు. అవినీతి, అక్రమార్కుల హవా కొనసాగకుండా కేయూ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి వారి ఆగడాలను పూర్తిగా నియంత్రించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ భవనాల నిర్మాణాలను త్వరగా ప్రారంభించి పూర్తి చేసి, విద్యార్థినులు, విద్యార్థులకు వసతి సౌకర్యం ఆటంకం కలగకుండా, అన్ని కోర్సుల విద్యార్థులకు వసతులు ఏర్పాటు చేసేలా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల అత్యంత లోతైన పరిజ్ఞానంతో సమస్యల పరిష్కార మార్గాన్ని చూపించేందుకు ఉన్నతాధికారులే ముందుకు వచ్చి సహకరించి ప్రత్యేకత చాటుకోవాలన్నారు. కేయూ చుట్టూ రక్షణ వలయం ఏర్పడేందుకు తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేసి, కాకతీయ విశ్వవిద్యాలయానికి భద్రత, రక్షణ కల్పించి తీరాలని డిమాండ్ చేశారు.

# అణగారిన వర్గాల్లో అరుదైన అధికారి







### అంచలంచలుగా ఎదిగిన శ్రమజీవి ఆచార్య రామచంద్రం
### నిజాయితీకి మారుపేరుగా నిలుస్తున్నారు
### అధికార హోదాలో ఎక్కడ అవినీతికి అవకాశం లేదు
### రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం సేవలు కొనియాడదగినవి

**కేయూ క్యాంపస్, జై భీమ్ న్యూస్:**

సుశాలమైన కాకతీయ విశ్వవిద్యాలయానికి ఉన్నత అధికార హోదాలో అరుదైన గౌరవాన్ని తెచ్చిపెడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంను జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మనస్ఫూర్తిగా అభినందించారు. గురువారం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ లక్ష్యసాధనలోని గొప్పతనాన్ని మెరుగుపరచడం కోసం కష్టజీవిగా, శ్రమజీవిగా అధికార హోదాను పక్కనపెట్టి అసాధారణమైన విధులను నిర్వహిస్తున్న ఆచార్య రామచంద్రం అణగారిన వర్గాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలకు రిజిస్ట్రార్‌గా పదవిలో కొనసాగడం ఒక్కెత్తైతే, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించడం అత్యంత క్లిష్టమైనదన్నారు. రామచంద్రం పేరులోనే రాజనీతి ఉందని, కాకతీయ విశ్వవిద్యాలయంలో తాను నిర్వహించిన అధికార బాధ్యతలను ఒక్కొక్క బాధ్యతలో ఒదిగిపోయినట్లుగా పాలనకర్తగా తన సేవలను అందించారన్నారు. సేవ చేయాలనే తపన ఎంత ఉన్నప్పటికీ, నేటి కాలంలో పదవి వ్యామోహం కలిగిన అదృశ్య శక్తులు కిందికి లాగుతుండడం సహజంగా చూస్తూ ఉంటామని, కష్టతరమైన పాలన సాగుతుండగా కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తా. ప్రతాపరెడ్డి ఆలోచనను ఆచరణలో పెడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధిని ఒక్కొక్క మెట్టుగా ముందుకు నడిపిస్తున్నారని అభినందించారు. ఎంతో శ్రమ పడితే ఎంతో కష్టపడితే గాని ఇంతటి స్థాయికి చేరుకోలేమని ప్రత్యేకించి గుర్తు చేస్తూ అధికార హోదాకు తగినట్లుగా లోతైన సమస్యలను, క్లిష్టమైన సమస్యలను వీసీ అనుమతితో పరిష్కార మార్గాలను కనుగొంటూ విద్యార్థుల పక్షపాతిగా నిలవడానికి తీవ్రమైన కృషి చేస్తున్నారన్నారు. వీసీ మాటే తన మాటగా భావిస్తూ సమృద్ధి కలిగిన సాహసవంతమైన నిర్ణయాలతో కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనను గాడిలో పెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. షెడ్యూల్ కులానికి చెందిన ఒక సాధారణ అధికారి ఇంత పెద్ద స్థాయిలో నిలబడటం యావత్ జాతికి గర్వకారణంగా ఉందన్నారు. విద్యా ద్వారా సాధికారత, జ్ఞానం ద్వారా విముక్తి అనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాన్ని కార్యరూపంలో పెడుతూ పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల్లో వెలుగు నింపడం లక్ష్యంగా చేసుకొని పనిచేస్తున్న జై భీమ్ సంస్థకు, సంస్థ యజమానియైన డాక్టర్ బరిగెల శివకు కేయూలో విశిష్ట సన్మానం జరిగింది. కేయూలో ఆచార్య రామచంద్రం కులమత బేధాలను ఏమాత్రం పట్టించుకోకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేసే విధంగా ముందుకు నడుస్తూ కేయూ పాలనలో మరెన్నో అద్భుతాలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా తెలిపారు. అనేక సమస్యలు విశ్వవిద్యాలయ పాలనకు అడ్డంకులు, ఆటంకాలు సృష్టిస్తున్నప్పటికీ మొక్కవోని విశ్వాసంతో లక్ష్య సాధనను చేరుకోవడానికి మాత్రం ఎక్కడా తగ్గకుండా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం జై భీమ్ సంస్థను అభినందించారు. నిజాన్ని నిర్భయంగా రాయడం కోసం జై భీమ్ సంస్థ నిర్మాణించబడడం యాజమాన్యం గొప్పతనమని, జై భీమ్ సంస్థ సమాజ నిర్మాణం కోసం పాటుపడుతున్న విధానం ఎంతో ప్రతిష్టాత్మకమని, తెలుగు రాష్ట్రాలను ప్రభావితం చేసే వ్యాసాలను రాస్తుండడం డాక్టర్ బరిగెల శివ గొప్పదనమన్నారు. ఆచరణకు సాధ్యం కాని ప్రణాళికలతో ముందుకు సాగుతున్న జై భీమ్ సంస్థను అభివృద్ధి పరచడం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జై భీమ్ సంస్థకు రక్షణగా నిలిచినట్లయితే సమాజానికి రక్షణగా నిలిచినట్లేనని అభివర్ణిస్తూ కొనియాడారు.

# వికలాంగుల హక్కులను కాపాడుకోవాలి

**వికలాంగుల హక్కుల రక్షణ కోసం పాటుపడాలి**
**వికలాంగుల సంక్షేమం కోసం సుదీర్ఘమైన పోరాటాలు సాగుతున్నాయి**
**హక్కుల రక్షణలో భాగంగా ఎంతో నష్టపోతున్న దివ్యాంగులు**
**జై భీమ్ సంస్థ పోరాటం కొనియాడదగినది**
**కలిసికట్టుగా పోరాడితేనే విజయం సాధించగలం**
**ప్రణాళికల లక్ష్యంగా పోరాడితేనే విజయం దక్కుతుంది**

**కేయూ క్యాంపస్ జై భీమ్:-**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగ ఆచార్యులు శ్రీనివాసరావు పెదమల్లను జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ గురువారం మానవీయ శాస్త్ర పరిపాలన భవనం ముందు మర్యాదపూర్వకంగా కలిసి జై భీమ్ సంస్థల చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ వికలాంగుల ఉద్యమానికి ఊపిరి నింపుతూ ఆదర్శం పోస్తున్న మేధావి బాధ్యతను తీసుకున్న ఆచార్య శ్రీనివాసరావును ఎంత అభినందించినా తక్కువేనన్నారు. మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆచార్య శ్రీనివాసరావును "శ్రీనివాస్" అని పిలుచుకునే చొరవను అనతి కాలంలోనే సంపాదించుకొని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ పోరాట సమితికి నాయకత్వం వహించిన మేధావిగా ఎంతో గుర్తింపు పొందారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం వికలాంగులకు జరుగుతున్న అన్యాయాల పట్ల ఆచార్య శ్రీనివాసరావు ఎన్నో అమూల్యమైన విషయాలు తెలిపారన్నారు. దివ్యాంగులు ఎంతో వేదన పడుతూ ఉద్యమాలు చేస్తున్నారని, ప్రభుత్వాలు దివ్యాంగుల హక్కులను రక్షించడంలో వెనుకబాటుతనం ప్రదర్శిస్తున్నాయని అన్నారు. దివ్యాంగులకు దక్కవలసిన హక్కులు నేటికీ కాలరాయబడటం బాధాకరమన్నారు. ఎంతో ఉన్నతమైన భావాలు కలిగిన వ్యక్తులు, శక్తులు, మేధావులు దివ్యాంగులలో లెక్కలేనంత మంది ఉన్నారన్నారు. కేవలం "దివ్యాంగులు" అనే ఒక్క పదంతో ప్రభుత్వాలు వికలాంగులను చిన్నచూపు చూస్తూ, వారికి రావాల్సిన హక్కులను సకాలంలో కల్పించకుండా, సంక్షేమాన్ని నిర్వహించకుండా దివ్యాంగుల అభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగులు వెనుకబాటుతనం నుంచి ముందుకు రావాలంటే ప్రభుత్వాలు తప్పకుండా చేయూతనివ్వాల్సిందేనని సూటిగా అడిగారు. ఆచార్య శ్రీనివాసరావు లాంటి నిబద్ధత కలిగిన మేధావిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తన సేవలను ఉపయోగించుకుంటే సమాజానికి మేలు చేకూరుతుందని, దివ్యాంగుల సంక్షేమానికి, రక్షణకు సహాయపడినవారు అవుతారని గుర్తుచేశారు. ప్రాణత్యాగాలను సైతం లెక్కచేయకుండా వాటిని పునాదులుగా వేసుకొని దివ్యాంగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న అరుదైన మేధావులలో ఆచార్య శ్రీనివాసరావు ఒకరని గర్వంగా చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు అనుకూలంగా, సానుకూలంగా దివ్యాంగుల న్యాయపరమైన హక్కుల కోసం ప్రణాళికలు వేసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీనివాసరావు తనకు సూచించిన అంశాలను తెలియజేస్తూ జై భీమ్ సంస్థ దివ్యాంగుల పరిరక్షణ కోసం నిరంతరం నిర్విరామంగా ఉద్యమ పోరాటాన్ని బాధ్యతగా తీసుకొని పోరాడుతున్నందుకు యావత్ తెలుగు రాష్ట్రాల దివ్యాంగుల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. 40 సంవత్సరాలుగా దివ్యాంగుల నాణ్యమైన హక్కులు అణచివేయబడుతున్నాయని, వాటిని కాపాడుకోవడం కోసం ప్రజా సంఘాలు, ఉద్యమకారులు, తెలంగాణ ప్రజాస్వామ్యవాదులు ముందుకు వచ్చి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.



## రాజమౌళి వ్యాఖ్యలు హిందువులను కించపర్చడమే

**అమరావతి,నవంబర్ 20(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ఫైర్ అయ్యారు. రాజమౌళి సినిమాలు చూసి హిందూ దేవుళ్లపై గౌరవం ఉందనుకున్నాం అని, ఆయన కామెంట్లపై హిందువులు ఇప్పుడు రగిలి పోతున్నారన్నారు. ఆంజనేయుడిపై నమ్మకం లేదనడం హిందువుల మనోభవాలు దెబ్బతీయడమే అని ధ్వజమెత్తారు. అంత పేరు, అంత డబ్బు, ప్రతిష్ట హిందూ దేవుళ్లను ఉపయోగించుకుని తెచ్చుకుంటారని విమర్శించారు. హిందూ దేవుళ్లని, సనాతన ధర్మాన్ని అవమానించే హక్కు ఎవరిచ్చారని,.. హిందూ సమాజం చులకనగా కనిపిస్తోందా అని రాజమౌళిని యామిని శర్మ ప్రశ్నించారు. గురువారం విజయవాడలో సాధినేని యామిని శర్మ మీడియాతో మాట్లాడుతూ? 'చట్ట ప్రకారంగా ఏమైనా చేసుకోవచ్చు. సంబంధం లేకుండా హిందూ దేవుళ్లను అంటే ఊరుకోం. దర్శకుడిగా రాజమౌళికి పేరు రావడానికి ఆ దేవుడే కారణం. ఏదో ఒక విధంగా రామ, కృష్ణ అనడం వల్లనే ఆ స్థాయి వచ్చింది. వ్యక్తిగత అంశాలతో హిందూ దేవుళ్లపై కామెంట్ చేస్తే ఊరుకోం అని ఘాటుగా హెచ్చరించారు. సినీ ఇండస్ట్రీలో కొంతమంది అహంకారంతో మాట్లాడితే ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని, స్పృహలో ఉండి మాట్లాడాలి. మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. సనాతన ధర్మానికి నిరూపణలు అవసరం లేదు.. వీళ్ళెవరు నిరూపించడానికి. మీరు సినిమాలు చేసుకోండి.. మీ టీజర్ల కోసమో, మీ పబ్లిసిటీ కోసమో వినియోగించుకోవడానికి దేవుడు కమర్షియల్ కాదు' అని యామిని శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా టైటిల్ గ్లింప్స్ తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. టైటిల్ గ్లింప్స్ విడుదల కోసం పెద్ద ఎత్తున రాజమౌళి ఓ ఈవెంట్ నిర్వహించారు. గ్లింప్స్ విడియో రిలీజ్‌కు పదే పదే సాంకేతిక ఆటంకాలు ఎదురుకావడంతో.. రాజమౌళి నిరాశ చెంది హనుమంతుడిపై కామెంట్స్ చేశారు. దేవుడి పైన తనకు పెద్దగా నమ్మకం లేదని, హనుమంతుడు తన వెనుకాల ఉండి నడిపించారని నాన్న చెప్పినపుడు వెంటనే కోపం వచ్చిందన్నారు. హనుమంతుడు ఉంటే ఇదేనా నడిపించేది అని రాజమౌళి అసహనం వ్యక్తం చేశారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# వండర్ ఫుల్‌గా నిర్వహించబడిన వార్షికోత్సవం





**బిలివర్స్ చర్చ్ క్రైస్తవ గొప్పతనాన్ని చాటుతుంది**
**బిలీవర్స్ చర్చ్ 25వ వార్షికోత్సవ జూబ్లీ శుభసందర్భంగా**
**నందనం గ్రామంలో మహోత్సవ వేడుకలు**

**నందనం జై భీమ్ న్యూస్:-**

హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలోని బిలీవర్స్ చర్చిలో 25వ వార్షికోత్సవ జూబ్లీ వేడుకలు దేవుని కృపతో అత్యంత భక్తి భావంతో, అపార ఆత్మీయతతో, ఘన వైభవంతో నిర్వహించబడ్డాయి. చర్చిలో జరిగిన ఈ మహోత్సవం గ్రామమంతటా ఆధ్యాత్మిక ఆనందం నింపింది.

**రెండ్ ఫాదర్ బర్ల షద్రక్ అభిషేకం -చర్చికి గొప్ప గౌరవం..**

ఈ పవిత్ర దినంలో ముఖ్య ఘట్టంగా దేవుని దివ్య పిలుపు కింద ఎన్నో సంవత్సరాలుగా చర్చికి సేవలందించిన డీకెన్ ఫాదర్ బర్ల షద్రక్ విజయ పాస్టరమ్మను గౌరవమ్మైన మెట్రోపాలిటన్ తండ్రి బిషప్ తండ్రుల ఆశీర్వాదాలతో రెవ. రెండ్ ఫాదర్‌గా అభిషేకించడం జరిగింది. ఈ అభిషేకం చర్చికి మాత్రమే కాక, నందనం గ్రామానికి, గ్రామంలోని క్రైస్తవ సంఘానికి, బిలీవర్స్ చర్చి చరిత్రలోకూ ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయింది.

**సేవకు గుర్తింపు - ఆత్మీయ సన్మానం..**

ఫాదర్ దేవుని వాక్యాన్ని గ్రామ ప్రజలకు అందించడం, క్రైస్తవ సంఘాన్ని ఏకతాటిపై నడిపించడం, దరిద్రులకు, అనారోగ్యంతో ఉన్నవారికి, సహాయం కోరినవారికి నిస్వార్థ సేవ చేయడం వంటి ఆయన మహోన్నతమైన సేవలను గుర్తిస్తూ చర్చిసభ్యులు, గ్రామస్థులు, బంధువులు కలిసి చీర సన్మానం నిర్వహించి ఆయనకు ఆత్మీయ గౌరవం సమర్పించారు. చర్చిమందిరం అంతా ప్రేమ, ఆనందం, ప్రార్థనలతో నిండిపోయింది. ప్రార్థనలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఈ సందర్భంగా అందరూ కలిసి ఇలా ప్రార్థించారు:"ప్రభువైన యేసు క్రీస్తు అనుగ్రహం ఎల్లప్పుడూ మా రెవ. ఫాదర్ బర్ల షద్రక్ పై నిలిచియుండ గాక ఆయనను మహిమముగల సేవలకు ప్రభువు మరింతంగా ఉపయోగించును గాక ఆమేన్."

**అదనంగా..**

ప్రత్యేక స్తోత్రగీతాలు
ప్రార్థనా సమయాలు
వాక్య భాగాలు
సంఘ సాక్ష్యాలు
జూబ్లీ కేక్ కటింగ్
చర్చి చరిత్ర ప్రదర్శన
సేవా కార్యక్రమాల గుర్తింపులు
అన్నీ ఎంతో శ్రద్ధగా నిర్వహించబడ్డాయి.

25 సంవత్సరాల ఆత్మీయ ప్రయాణాన్ని గుర్తుచేసిన రోజు

ఈ 25 ఏళ్లలో బిలీవర్స్ చర్చిలో వందలాది కుటుంబాలు ఆత్మీయంగా ఎదగడం, యువతకు సువార్త సేవ అవకాశాలు, గ్రామంలో శాంతి, ఏకతను స్థాపించిన కార్యక్రమాలు, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రార్థనా సేవలు, విద్యార్థులకు ఆత్మీయ మార్గదర్శనం, అనేక సేవా కార్యక్రమాలు వంటి అనేక గొప్ప పనులను ఈరోజు ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. ముఖ్య అతిథుల హాజరు ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా సీఐ రామ్మూర్తి, డాక్టర్ బరిగెల శివ , ఎస్సై శ్రీనివాస్, అలాగే గ్రామ పెద్దలు, చర్చి నాయకులు, భక్తులు, యువత, మహిళా సంఘాలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వారి హాజరుతో ఈ కార్యక్రమం మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ ప్రత్యేక సందర్భంలో ముఖ్యఅతిథి డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ లోకం మొత్తం క్రీస్తు ప్రేమతో నిండి ఉన్నదని తెలిపారు. సంఘ కాపరి రెవరెండ్ బర్ల షద్రక్ ఎంతో కష్టపడి సువార్త సేవను ప్రకటిస్తున్నారని అలాంటి దైవ సేవకుడు నందనం గ్రామానికి దొరకడం గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 25 సంవత్సరాల సుదీర్ఘ సేవ పోరాటంలో వందల వేల ఆత్మలను రక్షిస్తూ సువార్తను ప్రకటిస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో క్రైస్తవులకు గడ్డుకాలం నడుస్తుందని దానిని అధిగమించడం కోసం ఐక్యంగా విశ్వాసంతో ప్రార్థన చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# దేవుడిని అడ్డంగా పెట్టుకుని సినిమాలు

**కనీస సామాజిక బాధ్యత లేని రాజమౌళి**
**వారణాసి టైటిల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత**

**హైదరాబాద్,నవంబర్ 20(జై భీమ్ న్యూస్):**

దర్శకుడు రాజమౌళి దేవుణ్ణి అడ్డంగా పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ నాయకురాలు మాధవి లత పేర్కొన్నారు. తాజాగా వారణాసి టైటిల్ రిలీజ్ సందర్భంగా రాజమౌళి చేసిన కామెంట్లపై మాట్లాడుతూ... నమ్మకాన్ని వ్యాపారంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. హిందువులు తేరగా దొరుకుతున్నారా? రాముడికి ఒకే పెళ్లాం ఉంది అంటున్న రాజమౌళికి ఎంతమంది పెళ్లాలు ఉన్నారని ప్రశ్నించారు. కర్మ ఫలితం అనుభవించాడు కాబట్టే ఆంజనేయుడు లేడని అన్నాడు.. సినిమా చూసే మా వాళ్లకు బుద్ధి ఉండాలని హిందువులను ఉద్దేశించి అన్నారు. వందల కోట్లు సంపాదించిన నీవు.. బాహుబలి సినిమాకి పనిచేసిన వారికి ఏమైనా ఇచ్చావా? అని నిలదీశారు. రాజమౌళి భక్తిని తీసుకురాలేదు? దాన్ని వాడుకుంటున్నారన్నారు. భక్తే లేదు అనే వాడి దగ్గరికి మనం వెళ్తామా? నీవు ఏమి దైవ సేవ చేశావ్.. అయిన దేవుడు అన్ని కోట్లు ఇచ్చాడు కదా..? అని నిలదీశారు. నీకు ఎందుకు అంతా బాధ.. మనమే మన హిందూ ధర్మాన్ని కించ పరుస్తున్నామన్నారు మాధవి లత.. 'మా కష్టం మీద విష బిందువు వేస్తున్నారు.. దయచేసి మీరు ఇలాంటి కామెంట్స్ చేయకు.. వ్యక్తి గతం అయితే ఇంట్లో మాట్లాడుకోవాలి.. ఆయన మాట్లాడింది వ్యక్తిగతం కాదు.. సినిమా వాళ్లు ఈ అంశంపై స్పందించక పోవడం వాళ్ల సొంతం.. అక్కినేని నాగేశ్వరరావు ఎప్పుడు దైవ దూషణ చేయలేదు.. మన మతం మీద మనమే సినిమాలు తీస్తూ దూసిస్తే ఎలా? సినిమా చూసే వాళ్లు కూడా భక్తి లేదని అనుకుంటే ఆయన వ్యాపారం తుస్సు మంటుంది.. ఆయనకు సామాజిక బాధ్యత లేదు.. టికెట్ కొనుక్కుని సినిమా చూసే వాళ్ళను అవమానించారు.. మనసు గాయ పరిచారు.. అందరూ నాస్తికులు అయితే నీ సినిమా చూసేది ఎవరు? నా దేవుళ్ళను ఒవైసీ బ్రదర్స్ అవమానించారని నేను రాజకీయాల్లోకి వచ్చాను.. నా దేవుళ్ళ పైకి ఎవరు వచ్చిన ఊరుకోను.. నాకు పదవి వచ్చిన రాకున్నా ఇలానే ఉంటా.. రాజమౌళి మాటల ప్రభావం పడుతుంది.. ఆంజనేయ స్వామిని అన్నావు కాబట్టే ఇప్పుడు నీకు చుట్టుకుంటుంది.. షూటింగ్ లలో దేవుణ్ణి ఇంకా ఏమన్నావో..? రాజమౌళితో సమాధానం భగవంతుడు ఇప్పిస్తారు.. దేవుడు ఉన్నాడు అని ఆయనతోనే చెప్పిస్తారు.. బస్తీ మే సవాల్ చూడండి.. ఆయన మీద జాలి కూడా పోయింది.. రాముడి మీద అసహ్యంగా మాట్లాడారు.. ఆయనకు క్షమాపణకు కూడా అర్హత లేదు.. తగిన గుణపాఠం చెప్పాలి..' అని రాజమౌళిపై ఫైర్ అయ్యారు.

# హిందూసమాజాన్ని వేదనకు గురి చేసిన రాజమౌళి

**క్షమాపణలు చెప్పకుంటే సినిమాలు ఆపేస్తాం**
**విశ్వహిందూ పరిషత్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్**

**హైదరాబాద్,నవంబర్ 20(జై భీమ్ న్యూస్):**

హనుమంతుడుపై టాలీవుడ్ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పకపోతే.. కచ్చితంగా ఆయన సినిమాలు ఆపేస్తాం అంటూ విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది. తండ్రి మనోభావాలను సైతం కించపరుస్తూ మాట్లాడారని విశ్వహిందూ పరిషత్ తెలుగు రాష్ట్రాల క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాముడు, కృష్ణుడు, హనుమంతుడు దేవుళ్లుగా కనిపించలేదా? అని ప్రశ్నించారు. హిందూ సమాజం చూస్తూ ఊరుకోదని దర్శకుడు రాజమౌళిని రవికుమార్ హెచ్చరించారు. రాజమౌళి వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని తీవ్ర వేదనకు గురిచేశాయని పేర్కొన్నారు. 'ప్రముఖ దర్శకుడు రాజమౌళి గారు హిందూ సమాజం ముందు గల్లీ స్థాయి వ్యక్తిగా దిగజారిపోయారు. హనుమంతుడికి, మీ క్లిప్స్ రిలీజ్ అవకపోవడానికి సంబంధం ఏంటి?. కృష్ణుడు నీ దృష్టిలో జగద్గురువు కాదు. రాముడు, కృష్ణుడి, హనుమంతుడిపై మీరు చేసిన విమర్శలను విశ్వహిందూపరిషత్ ఖండిస్తుంది. మీ వ్యాఖ్యలను ధర్మ ద్రోహంగా భావిస్తాం. అంజనేయ స్వామిని నిందించడం మీకు ఫ్యాషన్‌గా మారింది. మదం, గర్వంతో మాట్లాడిన ప్రేలాపనలుగా భావిస్తాం. మీ తండ్రిని కూడా బాధించేలా మాట్లాడావు. మీ ప్రచారాలకు, మీ క్లిప్స్ కి హనుమంతుడికి సంబంధం ఏమిటి. కాసుల గర్వంతో మాట్లాడితే విశ్వహిందూ పరిషత్ క్షమించదు. బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పు. దైవాన్ని అపహాస్యం చేసేలా మీ సినిమాల్లో ఉంటే.. విశ్వహిందూ పరిషత్ ఆ సినిమాలు ఆపేస్తుంది' అని సత్య రవికుమార్ వార్నింగ్ ఇచ్చారు.

# దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

**నమ్మకం లేదంటావా రాజమౌళి**
**మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్**

**హైదరాబాద్,నవంబర్ 20(జై భీమ్ న్యూస్):**

రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. రూ. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు. అసలు నీ ప్లాన్ ఏంది..? ఇప్పుడు వారణాసి పేరుతో మహేష్‌బాబును పెట్టి మరో సినిమా తీస్తున్నావ్.. ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశావా? అని నిలదీశారు. లేదా నువ్వు నిజంగానే నాస్తికుడివా..? ఓ సారి డిక్లెర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అసలు నీ తప్పేం లేదు.. అసలు తప్పు హిందులదే అన్నారు. నీలాంటి నీఛపు డైరెక్టర్లను హిందువులు కనుగొనలేక పోతున్నారన్నారు. ధర్మం పట్ల, హిందూ దేవుళ్ల పట్ల నమ్మకం లేని రాజమౌళి సినిమాలు హిందువులు ఎందుకు చూడాలని రాజాసింగ్ నిలదీశారు. 'బాహుబలి సినిమా తీశావు.. ప్రభాస్‌తో శివలింగాన్ని ఎత్తించావు.. కోట్ల రూపాయలు సంపాధించుకున్నావు.. మళ్లీ మా హిందు దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతున్నావు. రాజమౌళికి ఇది కొత్తేం కాదు.. భగవాన్ శ్రీకృష్ణుడికి చెందిన 16 వేల మంది దాసులను, లవర్స్ అంటూ హేళన చేశాడు. నాకు రాముడిపైన ఇష్టం లేదు.. రాముడి స్టోరీ బోరింగ్ స్టోరీ అని గతంలో ట్వీట్ చేశాడు. ఇప్పుడు హనుమంతుడిపైన కామెంట్స్ చేశాడు.. హిందువులకు ఓ సూచన.. ఇలాంటి డైరెక్టర్లపై కంప్లేంట్ ఇవ్వండి. ఇలాంటి వ్యక్తులను జైల్లో వేస్తేనే హిందూ దేవుళ్లపై కామెంట్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుస్తుంది. ఇలాంటి పనికిరాని డైరెక్టర్ సినిమాలు చూడొద్దు.. మనం ఇలాంటి వ్యక్తులు తీసిన సినిమాలు చూస్తాం.. వాళ్లు వందలు వేల రూపాయలు సంపాధించుకుంటారు. ఇలా నాస్తికత్వం పేరుతో మన దేవుళ్లపై కామెంట్స్ చేస్తారు.. అందుకే ఈ డైరెక్టర్ సినిమాలు బ్యాన్ చేద్దాం..' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE


# నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ




టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించుకున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.

# రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

**50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ఫ్రంట్ పేజీలో ఫోటో**



అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్'తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి - 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.



# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

**ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్**

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

# కళ్యాణి ప్రియదర్శి కొత్త చిత్రం ప్రారంభం

కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ మూడు వందల కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు. ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని,



వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్. దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రవీణ్ భాస్కర్, శ్రీకుమార్ దీనికి దర్శకుడితో కలిసి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తుండగా, గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.